ప్రజాశక్తి

శుక్రవారం 19 జులై 2024



'ఉపాధి' ప్లాంటేషన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని బారమాసి పంచాయతీ బారపల్లి గ్రామంలో హార్టికల్చర్ ప్లాంటేషన్‌లను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్ గురువారం పర్యటించి తనిఖీ చేశారు. అడ్డుమండ పంచాయతీ ఫారం పాండ్ పనులు చేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ, ఉద్యానవన పంటల ద్వారా రైతులకు నిత్యం ఆదాయం సమకూరేలా చర్యలు చేపడుతున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మొక్కల నాటడం, సంరక్షణకు ఉపాధి పథకంలో నిధులిస్తామన్నారు. ఎపిడి పవన్, ఎపిఒ మూర్తి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న పిఒ అభిషేక్

ప్రణాళిక, పర్యవేక్షణ లేని పనులతో పరేషాన్!

నిర్మించిన రెండు నెలలకే రహదారి అస్తవ్యస్తం

- రూ.2.40 కోట్లతో చేపట్టిన రోడ్డు వర్షం పాలు
- కల్వర్టులు, రక్షణగోడల్లేక కొట్టుకుపోయిన వైనం
- సరైన పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యంగా నిర్మాణం
- రాకపోకలకు గిరిజనం అనునిత్యం అవస్థలు
- ఇదీ రాజుపాక, పట్కుదొవడ రహదారి దుస్థితి

ప్రజాశక్తి -అనంతగిరి :సరైన ప్రణాళిక, పర్యవేక్షణలేని అధికారుల నిర్వాకం, ఇష్టారాజ్యంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో కోట్ల ప్రజాధనంతో నిర్మించిన రహదారి వర్షంపాలై అస్తవ్యస్తంగా తయారైంది. ఏళ్లతరబడి గిరిజనుల మొర, ప్రజాప్రతినిధుల పోరాట ఫలితంగా సాధించిన రోడ్డు పనులు రెండునెలలకే అధ్వానంగా తయారవ్వగా, ఈ ఏడాది వర్షాల సీజన్ ముగిసే సరికి అసలు రోడ్డు ఉంటుందాయని మన్యవాసులు ఆవేదన చెందుతున్నారు.

అనంతగిరి, హుకుంపేట రెండు మండలాల సరిహద్దు పివిటిజి గ్రామాలైన డెక్కపురం, పట్కుదొవడ గ్రామాల మధ్య రహదారి నిర్మాణ పనులకు కనెక్టివిటీ పాడేరు ప్రాజెక్టు కింద 2022-23లో ట్రైబల్ వెల్ఫేర్ పథకం కింద రూ. 2.40కోట్ల నిధులు మంజూరయ్యాయి. అనంతగిరి పంచాయతీ రాజుపాక గ్రామం నుంచి డెక్కపురం మీదుగా హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ పట్కుదొవడ గ్రామం వరకు సుమారు ఏడు కిలోమీటర్లు మేర రింగ్ రోడ్డు పనులు జరిగాయి. ఇది ఇలా ఉన్నప్పటికీ బూర్జ పంచాయతీ పరిధి జాంకరవలస గ్రామం నుండి పట్కుదొవడ గ్రామం వరకు మరో రోడ్డు పనులు జరుగుతున్నాయి.

ఇందులో భాగంగా రాజుపాక గ్రామం మీదుగా రోడ్డు నిర్మాణ పనులు తూతుమాత్రంగా చేపట్టారు సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టడంతోపాటు మట్టిరోడ్డు పనులు చేపట్టేటప్పుడు రోడ్డుకు ఇరువైపులా కాలువలు, అక్కడకక్కడ రక్షణగోడలు, ర్యాంపులు, కల్వర్టులు వంటి పనులు చేపట్టాల్సి ఉంది. అయితే రోడ్డు పనుల అంచనాల్లో అవి ఉన్నాయో, లేదోగానీ, ప్రస్తుత చేపడుతున్న పనుల్లో అవి లేకపోవడం వల్ల నిర్మాణంలో ఉన్న రోడ్డుపైనే వర్షపునీరు ప్రవహించడం వల్ల రోడ్డు మొత్తం బాటలుగా ఏర్పడడంతోపాటు ఇరువైపులా కోతకు గురై కొట్టుకుపోతోందని స్థానికులు అంటున్నారు. వర్షాకాలం తొలిరోజుల్లోనే పరిస్థితి ఇలా ఉంటే మున్ముందు ముసురులు, తుపానులు, భారీ వర్షాలు ముంచెత్తి సీజన్ ముగిసేసరికి అసలు రోడ్డు అనవాలు అయినా ఉంటుందాయని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ఏళ్లతరబడి పోరాటం, దశాబ్దాలుగా ఎదురుచూపుల తర్వాత నిధులు మంజూరై పనులు జరుగుతున్నా ఆనందం లేకుండా, ఇలా నిర్మించిన రోడ్డు, అలా కొట్టుకుపోవడంపై మన్య వాసులు ఆందోళన చెందుతున్నారు. అరకొరగా పనులు చేయడం, బిల్లులు చేసుకున్న తర్వాత నిర్మాణ పనులు వదిలేయడం ఏజెన్సీలో సర్వసాదా రణంగా జరిగే తంతు కావడంతో, రాజుపాక రోడ్డుకూడా అదే కోవలోకి అధికారులు, కాంట్రాక్టర్లు చేర్చేస్తారేమో నని అనుమా నం వ్యక్తంచేస్తున్నారు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రోడ్డు పక్కల్లో కోతకు గురైన మట్టి



అంచుల్లో కోతకు గురైన రాజుపాక, పట్కుదొవడ రహదారి

కూలిన పాఠశాల భవనాల పరిశీలన



కూలిన పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:వర్షాలకు భారీ వృక్షం కూలి, భవనంపై పడడంతో నేలమట్టమైన మండలంలోని వనభసింగి పంచాయతీ టోంగికోట మండల పరిషత్ పాఠశాలను ఎంఇఒ కె.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ బృందం గురువారం పరిశీలించింది. పాఠశాలలు కూలిపోతున్నా కన్నెత్తి చూడరా?' శీర్షికతో ప్రజాశక్తిలో వెలువడిన కథనంతో ఎంఇఒతోపాటు సిఆర్‌పిల బృందంతో పాటు వనభసింగి సర్పంచ్ లక్ష్మణ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఇఒ కృష్ణమూర్తి మాట్లాడుతూ పాఠశాల భవనం పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నామన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, సమస్యలను వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్పంచ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో స్థానికులు ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు.

టోంగికోట పాఠశాలకు భవనం శిథిలావస్థకు చేరడంతో పశువుల పాక వంటి రేకుల షెడ్డులో ప్రస్తుతం తరగతులను నిర్వహిస్తున్నారని, వర్షం కురిసినా, ఎండకాసినా ఈ రేకుల షెడ్‌లో ఉండి చదువుకోవడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రేకుల షెడ్‌లో వర్షపునీరు బురదమయంగా మారిందన్నారు. కొత్త భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు అనిల్, కామేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

గిరి గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయండి

సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు



జ్వరపీడితుడిని పరామర్శిస్తున్న రామారావు

ప్రజాశక్తి- అరకు రూరల్ : మండలంలోని బస్కి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ప్రజలు తలనొప్పి, కడుపు నొప్పి, చలిజ్వరాలు, సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారని, వారికి సత్వరవైద్యం కోసం ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు కోరారు. గురువారం బస్కి పంచాయితీ కొర్రాగుడ, కంజరితోట, బరెంగి బంద తదితర గ్రామాల్లో పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న గిరిజనులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థతులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ బస్కి పంచాయతీలో జ్వరాలు తిష్టవేసి ఉన్నాయని, వైద్యసిబ్బంది వెంటనే ఇంటింటా సర్వేచేసి వైద్యసేవలుఅందించడంతోపాటు గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించాలని కోరారు.

రోడ్డుకు అడ్డంగా నిలిచిన లారీ

రాకపోకలకు ఇక్కట్లు : తరచూ ఇదే పరిస్థితి

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని అధికారులు

ప్రజాశక్తి- అరకు రూరల్ : అరకులోయ మండలం బస్కి పంచాయతీ రోడ్డు మాడగడ ఘాట్‌రోడ్డులో గురువారం కల్వర్టు పైపులతో లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది.దీంతో ఇరుకుగా ఉన్న ఈ రోడ్డులో అడ్డంగా లారీ ఆగిపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మరమ్మత్తులు, రోడ్డు వెడల్పు చేయాలని అనేక సార్లు అధికారులను విన్నవించిన పట్టించుకునే పరిస్థితి లేదని ఈ ప్రాంత గిరిజనులు వాపోతున్నారు

.గతంలో ఈ రోడ్డులో సిమెంట్ వ్యాన్ బోల్తా పడి గిరిజనులు చనిపోయారు. ఇరుకుగా ఉండే ఈ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ రోడ్డు గుండా అరకువేలి మండలం బస్కి పంచాయితీ, మాడగడ పంచాయితీ, సుంకరమెట్ట పంచాయితి, హుకుంపేట మండలం బూర్జ ,వేంగాడ పంచాయితీ, అనంతగిరి మండలం పైనంపాడు పంచాయతీ గిరిజనులు నిత్యం అరకులోయ మండల కేంద్రానికి వివిధ పనులకు వచ్చిపోతుంటారు. రోడ్డు బాగాలేక ఇప్పటికే భయంతో రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు, ఇలా ఏదో ఒక అంతరాయంతో రాకపోకలకు ఇబ్బందులు కలగడంపై ఆవేదన చెందుతున్నారు. దీనిపై అధికారులకు ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఈ ప్రాంత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం అధికారులు స్పందించి రోడ్డు వెడల్పు చేసి, మరమ్మత్తులు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.



మాడగడ ఘాట్‌రోడ్డులో నిలిచిన లారీ

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం విజయభారతి ఓ ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో బిఎ (ఎకనామిక్స్, హిస్టరీ), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్), బిఎస్‌సి (కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, జువాలజీ, బోటనీ) వంటి కోర్సులతో పాటు ఎంఎస్‌సి (కంప్యూటర్ సైన్స్) పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒక్కొక్క కోర్సులో 60 సీట్ల చొప్పున మొత్తం 480 సీట్లు ఉన్నాయని తెలిపారు. కళాశాలలో పూర్తి స్థాయిలో అధ్యాపకులు ఉన్నారని, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంతోపాటు, తమ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్, జవహర్ నాలెడ్జ్ సెంటర్, లైబ్రరీ, ఎన్ఎస్ఎస్ విభాగం, ప్లేస్‌మెంట్ విభాగం, బాలురు, బాలికలకు వేరువేరుగా హాస్టల్ సదుపాయం, విశాలమైన క్రీడా మైదానం వంటి సదుపాయాలు ఉన్నాయన్నారు.

20లోగా దరఖాస్తుకు అవకాశం

ఈనెల 20లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వెబ్ ఆప్షన్ల నమోదుకు ఈనెల 23 నుంచి26వరకు గడువుందన్నారు. .వెబ్ ఆప్షన్ల మార్పునకు 27న అవకాశం ఉందని, ఈ నెల 31న సీట్లు కేటాయింపు ప్రక్రియ ఉంటుందన్నారు. దరఖాస్తులకు సంబంధించి సందేహాల నివృత్తికి కళాశాలలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని,ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలలోగానేరుగా వచ్చి సంప్రదించవచ్చన్నారు. అలాగే ఇతర సమాచారం, సందేహాల నివృత్తికి 7569163403, 8500406280 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ఆసక్తి కలిగి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత పొందిన ఆయా గ్రూపుల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని డిగ్రీ చదివేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విలీన మండలాల్లో

ఎడతెరిపి లేని భారీ వర్షాలు

- పొంగి ప్రవహిస్తున్న వాగులు వంకలు
- పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం
- శ్రీరామగిరిలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



చింతూరు మండలంలో ప్రవహిస్తున్న వర్షపు నీరు



శ్రీరామగిరిలో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి-విఆర్ పురం

అల్పపీడనం ప్రభావంతో అల్లూరి జిల్లా, చింతూరు డివిజన్ పరిధిలోని విలీన మండలాల్లో గురువారం ఎడతెరిపి లేని భారీ వర్షాలు కురిశాయి. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన వర్షం సాయంత్రం వరకు ఏకధాటిగా కురుస్తూనే ఉంది. దీంతో విఆర్.పురం మండలంలోని లోతట్టు గ్రామమైన శ్రీరామగిరి ముంపునకు గురైంది. వర్షపు నీరు బయటకు వెళ్లే అవకాశం లేక, ఎక్కడ నీరు అక్కడ నిలిచిపోయి ఇళ్లలోకి చేరింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వర్షానికి ఇలా ఉంటే వరదొస్తే తమ పరిస్థితి ఏమిటని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

మరో వైపు భారీ వర్షాల కారణంగా మండలంలోని అడవి వెంకన్న గూడెం, నూతిగూడెం, మొద్దుల గూడెం, అన్నవరం తదితర వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో 60 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. తెలంగాణ మండలం చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెకుక్టు చెందిన నాలుగు గేట్లు పూర్తిగా, 21 గేట్లు రెండు అడుగులు మేర ఎత్తివేయడంతో 68 వేల క్యూసెక్కుల నీరు గోదావరి నదిలోకి వచ్చి చేరడం, ఎగువ ప్రాంతాలలో వర్షాలు కురుస్తుండడంతో వరద పెరిగే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని పలువురు కోరుతున్నారు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ ముంపు ప్రాంతాలను సందర్శించారు. కూనవరం బ్రిడ్జి పైనుండి శబరి గోదావరి నది సంగమం వద్ద వదర ప్రవాహాన్ని చూశారు. విఆర్ పురం టిడిపి మండల నాయకులతో వరద గురించి మాట్లాడారు. ఆయన వెంట కూనవరం టిడిపి నాయకులు యడవల్లి భాస్కర్‌రావు, పోడియం అప్పారావు, ఉమమహేశ్వరరావు ఉన్నారు.

.జన జీవనం అతలాకుతలం..

చింతూరు : గురువారం కురిసిన భారీ వర్షాల కారణంగా చింతూరు పరిసర ప్రాంతాల్లోని వాగులు పొంగాయి. పంట పొలాలకు జలకళ సంతరించుకుంది. మొన్నటి వరకు ఇసుక తెలి ఉన్న వాగులు కుండపోతగా కురిసిన వర్షానికి మండలంలోని చంద్రవంక, సోకులేరు. కన్నులూరు, కుయుగూరు చీకటి వాగులు నీటితో పరవళ్ళు తొక్కుతున్నాయి. శబరి నది కూడా కొత్త వరద నీటితో నిండుగా ప్రవహిస్తుంది. వర్షంతో రైతులు ఏరువాక కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు.

బయట పడ్డ ఉపాధి హామీ కూలీలు..

కూనవరం : కూనవరం మండలంలో గురువారం ఉదయం నుండి ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. దీంతో బోదునూరు, పండరాజుపల్లి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. టేకులబోరు గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు బోదునూరు గ్రామానికి పనికి వెళ్లి తిరిగి వస్తుండగా బోదునూరు వాగు పొంగి ప్రవహించడంతో రావడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. కూలీలంతా ఒకరి చేతులు ఒకరు పట్టుకొని వాగుదాటి ప్రాణాలు దక్కించుకున్నారు.



శ్రీరామగిరి రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

పునరావాసానికి వచ్చేవారి కోసం ఏర్పాట్లు

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని వరద ముంపునకు గురయ్యే గ్రామాల నుండి పునరావాస కోసం వచ్చే ప్రజల కోసం రేఖపల్లి పంచాయతీ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం వెనుక, సుధాగూడెం, తహశీల్దారు కార్యాలయం మధ్యలోని మైదాన ప్రాంతంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని ధర్మతాలగూడెం, వడ్డుగూడెం, వడ్డుగూడెం కాలనీ, విఆర్ పురం, బీసీ కాలనీ, రాజుపేట తదితర ముంపు గ్రామాల వారు వరద ముంపు సమయంలో రేఖపల్లిలో పునరావాసం ఏర్పాటు చేసుకుంటారు. గోదావరి వరద పెరుగుతున్న నేపథ్యంలో గురువారం ఎంపీడీవో ఫణేంద్ర రెడ్డి, ఏవో రత్నకుమారి, పంచాయతీ సెక్రటరీ స్వరూప రెడ్డి దగ్గరుండి వర్షాన్ని సైతం లెక్క చేయకుండా జెసిబితో ఆయా ప్రాంతాల్లో పొదలను తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పునరావాసానికి వచ్చే వారి కోసం ముందు జాగ్రత్త చర్యగా ఈ పనులు చేయిస్తున్నామని చెప్పారు. వారికి అన్ని వసతులు కల్పిస్తామని, ఏమైనా సమస్యలుంటే ముందుగానే తమకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజుపేట సెక్రటరీ శ్రీనివాస్, పెద్దమట్టపల్లి సెక్రెటరీ రామారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



పునరావాసానికి ఇబ్బంది లేకుండా తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

అంగన్వాడీ కేంద్రం నుంచి గుడ్లు తరలింపుపై విచారణ

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ కమ్మరితోట అంగన్వాడీ కేంద్రం నుంచి గుడ్లును అంగన్వాడీ టీచర్ భర్త అక్రమంగా తరలించడంపై జీకే.వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మి, సూపర్వైజర్ మోహిని ఆధ్వర్యంలో గురువారం ఆ గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉమామహేశ్వరరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల ప్రత్యక్ష సాక్షుల సమక్షంలో విచారం చేపట్టామని తెలిపారు. ఈ విషయంపై అంగన్వాడీ టీచర్ రెడ్డి జయంతిని విచరించగా తన భర్త రాంబాబు తాను లేని సమయంలో అంగన్వాడీ కేంద్రం నుంచి అక్రమంగా గుడ్లు తరలించారని వివరణ ఇచ్చినట్లు తెలిపారు. ప్రత్యక్ష సాక్షులు కూడా రాంబాబు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారన్నారు. ఈ సంఘటనపై పూర్తి విచారణ చేసి వివరాలు సేకరించామని, దీనిని నివేదిక రూపంలో జిల్లా కలెక్టర్‌కు పంపడం జరుగుతుందని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న అధికారులు

వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -దేవీపట్నం

మండలంలోని దేవారం గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి గ్రామపంచాయతీ సర్పంచ్ తుర్రం రమాదేవి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచినీటి వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శరభరం, దేవారం గ్రామ పంచాయితీల ఎంపీటీసీ సభ్యులు తుర్రం జగదీష్ దొర, ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, తెల్లం కామన్న దొర, తిక్కశెట్టి సత్యనారాయణ, షేక్ సత్తార్, కొమరం రామకృష్ణ దొర, కారం రామస్వామి దొర, కారం వంశీకృష్ణ దొర, కారం రవికుమార్ దొర, కారం తమన్న దొర, వార్డ్ మెంబర్ సోదే ఉదయ్ కిరణ్ దొర, అడబాల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న దృశ్యం

కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు, : జిల్లా యంత్రాంగం సహకారంతో వైఎస్. జయమ్మ మెమోరియల్ ట్రస్ట్, గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ సంస్థల ఆద్వర్యంలో నిర్వహిస్తున్న కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను పాడేరు డివిజన్ ఫరిదిలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ కోరారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఆయా సంస్థల ప్రతినిధులు, పిహెచ్‌సిల వైధ్యాదికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జయమ్మ ట్రస్ట్, గ్రేస్ ఫౌండేషన్ సంస్థలు జిల్లా యంత్రాంగంతో ముందుకు వచ్చి మన ప్రాంత ప్రజలకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తాయన్నారు. ఐటిడిఎ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి రొమ్ము, గర్భాశయ, నోటి కేన్సర్లు ప్రాథమికంగా గుర్తించడానికి మెమోగ్రాం, పేప్ స్క్రీనింగ్‌వంటి పరీక్షలు చేస్తారన్నారు. . అనుమానం ఉంటె ఆల్ట్రా సౌండ్ పరీక్ష ద్వారా శరీరంలో అవసరమైన ఒక శాంపిల్ సేకరించి, బయాప్సికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. బయాప్సిలో పాజిటివ్ వచ్చిన వారిని విశాఖలోని హోమీబాబా కేన్సర్ కేంద్రానికి తరలించి చికిత్సలు అందిస్తారని కలెక్టర్ వివరించారు. పిహెచ్‌సి వైద్యాధికారులు ఎఎన్ఎం, ఆశాల ద్వారా అర్హులైన వారికి అవగాహన కల్పించి వైద్య శిభిరాలకు తరలించాలని సూచించారు.

ఐటిడిఎ పిఒ వి. అభిషేక్ మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా అర్హులను గుర్తించి స్క్రీనింగ్ పరీక్షలకు తరలించే విధంగా చర్యలు తీసుకున్నామని వివరించారు. వై.ఎస్. జయమ్మ మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధి రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ, 11 ఏళ్లుగా రొమ్ము, గర్భాశయ, నోటి కేన్సర్ల స్క్రీనింగ్ పరీక్షలను రెండు లక్షల మందికి నిర్వహించామన్నారు. దేశంలో 18 శాతం మంది అవగాహన లేక కేన్సర్ తో మరణిస్తున్నారని తెలిపారు. కేన్సర్ ప్రమాదకరమే అయినప్పటికీ ముందస్తుగా గుర్తించి తగు చికిత్స పొందితే ప్రాణాంతకం కాదన్నారు. పాడేరు ఆసుపత్రిలో సెకండ్ లెవల్ పరీక్షకు ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ ఉన్నప్పటికీ రేడియాలజిస్ట్ లేనందున, అరకు నుండి రేడియాలజిస్ట్‌ను డిప్యూటేషన్ పై నియమించాలని కలెక్టర్‌ను అభ్యర్ధించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ అవగాహన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.

మలేరియా మరణాలు జరగరాదు

మలేరియా కారణంగా ఒక్క మరణమూ సంభావించ రాదని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టంగా ఆదేశాలు జారీ చేసారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో మూడు ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులు, డిఎంహెచ్ఓ, డిఎంఓ, జిల్లాలోని పిహెచ్‌సిల వైద్యాదికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో కంటే పోజిటివ్ కేసులు తగ్గాయని అందువల్ల మలేరియా తగ్గిందని చెప్పలేమని, అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.మలేరియా మరణం లేకుండా చికిత్స అందించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. మొదటి రౌండ్ స్ప్రేయింగ్ పూర్తి అయినందున రెండవ రౌండ్ స్ప్రేయింగ్ ఇంటిలోపల కూడా చేయాలని స్పష్టం చేసారు. పిహెచ్ సి ఫరిధిని ఏడు సిగ్మెంట్లుగా విభజించి ప్రతి సిగ్మెంట్‌లో ఒక్కో రోజు స్ప్రేయింగ్ చేయాలని, ఇంటి లోపల చేయటానికి ఒప్పుకోనివారిని ఒప్పించాలని, ఆయా గ్రామాలలోని పెద్దల లేదా ఎన్జిఓల సహకారం తీసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగ్యు పరీక్షలకు ప్రజలు మన వద్దకు రాక ముందే మనమే వారి వద్దకు వెళ్లి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఎఎన్ఎం, ఆషాలకు అవసరమైన శిక్షణను అందించి ర్యాపిడ్ కిట్లను అందుబాటులో ఉంచాలని,అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఒక ప్రాంతంలో పాజిటివ్ గుర్తిస్తే రోగికి వెంటనే చికిత్స అందించడంతో పాటు ఆ ఇంట్లో వాళ్ళందరికీ చికిత్స అందించాలని, ఆ ప్రాంతంలో మాస్ స్క్రీనింగ్ నిర్వహించాలని సూచించారు. హైరిస్క్ ప్రాంతాలలో మరింత దృష్టి సారించాలన్నారు. నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి ఆయిల్ బాల్స్ వేయాలని, గంభూషియ చేప పిల్లలను వదలాలని, ఎస్ హెచ్ జి ల సహకారం తీసుకోవాలని ఆదేశించారు. ఇంటింటి ఫీవర్ సర్వేలు నిర్వహించాలని, యాంటీ లార్వా కార్యక్రమాలు ఉదృతం చేయాలని, డ్రైడే ఫ్రైడేపై విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులు వి. అభిషేక్, సూరజ్ గనోరే, జిల్లా ఉప వైద్యఆరోగ్యాదికారి డా. పుల్ల రావు, వైద్యాధికారులు వర్చువల్ గా పాల్గొనగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జమాల్ బాష, డిఎంఓ తులసి, డిఆర్‌డిఎ పిడి వి. మురళి, ఐసిడిఎస్ సిడిపిఓ ఝాన్సి, వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వై.ఎస్. జయమ్మ మెమోరియల్ ట్రస్ట్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గొప్పలవలసలో పెంకుటిల్లు నేలమట్టం

కించుమండ, కితలంగి గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: మండలంలో గురువారం తెల్లవార్లూ ఎడతెరిపి లేకుండా జోరున కురిసిన వర్షానికి సోవ్వా పంచాయితీ గొప్పులవలస గ్రామంలో కొర్ర నూకన్న గిరిజనుడికి చెందిన పెంకుటిల్లు పూర్తిగా కూలిపోయింది. ఇంట్లోని ధాన్యం, ఇతర ఆహార దినుసులతోపాటు ఇతర సామగ్రి సర్వం ధ్వంసమైంది. ఉన్న ఒక్క ఇళ్లు కూలిపోవడంతో నిరుపేద గిరిజనుడి కుటుంబం నిలువ నీడ లేకుండా రోడ్డున పడింది. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత గిరిజన కుటుంబీకులు కోరుతున్నారు. కాగా భారీ వర్షాలతో కించుమండ సమీపంలోని కోడిగెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో కించమండ, కితలంగి పంచాయతీ గ్రామాల గిరిజనుల రాకపోకలు స్తంభించిపోయాయి. చాపరాయి జలపాతం, కోసంగి గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి.

అంతుచిక్కని వ్యాధితో మూగజీవాల మృత్యువాత

ప్రజాశక్తి- చింతపల్లి : మన్యప్రాంతంలోని మూగజీవాలు అంతుచిక్కని వ్యాధితో మృత్యువాత పడుతున్నాయి. తాజాగా పెదబరడ పంచాయతీ కేంద్రంలో మూడు పశువులు మేతకు వెళుతున్న క్రమంలో హఠాత్తుగా కింద పడి ఊపిరాడక గిజగిజలాడుతూ మరణించడం పశువుల యజమానులను కంటతడి పెట్టించింది. వ్యవసాయ సీజన్లో రైతాంగానికి ఉపయోగపడే వేలాది రూపాయల విలువైన దుక్కిటెద్దులు) మృత్యువాత పడడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పటి వరకు ఆరోగ్యంగా ఉన్న పశువులు, అంతలోనే అస్వస్థతకు గురై మృతి చెందడంపై గిరిజనులు కలవరం చెందుతున్నారు. మేతకు వెళుతూ మందలోని మూడు పశువులు ఒక్కసారిగా కిందపడి ఎగశ్వాసతో ఊపిరాడక మృతి చెందాయని వారంటున్నారు. దీనిపై సంబంధిత పశు సంవర్ధకశాఖ అధికారులు దృష్టి పెట్టి, మరిన్ని పశువులు మృత్యువాత పడకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇదే సమయంలో దుక్కిటెద్దులు కోల్పోయిన గిరిజన రైతులను ప్రభుత్వపరంగా ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గిరిజన గ్రామాల్లో ఇంటింటా వైద్యసేవలు

డిఎంహెచ్ఓ ఆదేశాలతో కదిలిన వైద్యబృందాలు

ప్రజాశక్తి -పాడేరు : మండలం మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మినుములూరు ఉపకేంద్రం గ్రామాలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్‌భాషా ఆదేశాలతో గురువారం వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్య ఆరోగ్య సేవలు అందించారు. ఈ మేరకు జీడిపగడ, అల్జెరు, బంగారం మెట్ట, బిర్మిశాల ,చింతగున్నలు, మాదిగ బంద, వరంకూర, వనుగుకుపల్లి, తామర పల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రతి వ్యక్తి కి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని అనారోగ్యంతో ఉన్నవారికి చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు చలి జ్వరంతో బాధపడుతున్న వారికి ఫస్ట్ డోస్‌గా క్లోరోకిన్ మాత్రలు వేశారు.

వర్షాలు కురుస్తూ, వాతావరణ మార్పులతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తతో ఉండాలని, కాచి చల్లార్చిన నీళ్లు తాగాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమలు పెరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని , ఎవరికైనా అనారోగ్యం సంభవిస్తే వెంటనే స్థానికంగా ఉన్న ఆశా కార్యకర్తను, లేదా అంగన్వాడీకార్యకర్తలను సంప్రదించి ప్రభుత్వం ఉచిత మందులు పొందాలని, వ్యాధి తీవ్రత ఎక్కువైతే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య సేవలు పొందాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో 200 మందికి మలేరియా నిర్ధారణకు రక్తపరీక్షలు చేశారు. ఇతర వ్యాధులతో బాధపడుతున్న 150 మందికి చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఓ జి. సింహాద్రి, హెచ్‌వి వరలక్ష్మి పాత్ర, సరోజిని, హెల్త్ అసిస్టెంట్స్ శెట్టి నాగరాజు, కె.లక్ష్మణరావు , చలం, పడాల్, నాగరాజు, వైవి రమణ పాల్గొన్నారు

ప్రేమోన్మాది అరెస్టు

ప్రజాశక్తి -గాజువాక : ఉడా కాలనీలో ఈ నెల 16వ తేదీ రాత్రి యువతిపై దాడికి పాల్పడిన ప్రేమోన్మాది సిద్ధును న్యూపోర్టు పోలీసులు గురువారం అరెస్టుచేశారు. దీనికి సంబంధించి విశాఖ సిటీ డిసిపి-2 తుహిన్ సిన్హా గురువారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. సిద్ధు గతంలో విద్యార్థిని శ్యామలను తరచూ వేధించేవాడని తెలిపారు. దీనిపై ఏప్రిల్ నెలలో గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ తరలించారని వివరించారు. పోక్సో చట్టం కింద జైలుకు వెళ్లిన సిద్ధు బయటకు వచ్చి ఈనెల 16వ తేదీన గొంతువానిపాలెం వచ్చి శ్యామలపై దాడికి ప్రయత్నించాడు. తల్లి సింగంపల్లి సావిత్రి అడ్డుకోవడంతో ఆమె చేతికి గాయమైంది. ఆమె ఫిర్యాదు మేరకు ఎసిపి మోసేజ్ పాల్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దాలిబాబుతోపాటు, మరి కొంతమంది సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి నిందితుడు సిద్దును విశాఖ విమల విద్యాలయం వద్ద పట్టుకొని రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

మొక్కపుట్టులో మంచినీటి బోరు ఏర్పాటు

గిరిజనుల విజ్ఞప్తికి స్పందించిన జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండలంలోని తరిమికొట్టు గ్రామపంచాయతీలో తాగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. దీనిపై అనేక దఫాలుగా గ్రామసభల్లో, మండల సర్వసభ్య సమావేశంలో వినతులు సమర్పించారు. వాటిపై స్పందించిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రత్యేక చొరవ తీసుకుని మొక్కపుట్టలో మంచినీటి బోరు ఏర్పాటుకు రూ.1.40లక్షల జెడ్‌పి నిధులను మంజూరు చేశారు. గురువారం సర్పంచ్ గల్లేల పులమోతి ఆధ్వర్యంలో బోరు బావి తవ్వకాలకు వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పాంగి పద్మారావు , సీనియర్ నాయకులు జెవివిఎన్ మూర్తి శంకుస్థాపన చేశారు. ఎట్టకేలకు బోరు ఏర్పాటు కానుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో జర్జుల ఉపసర్పంచ్ సాధూరాం, రాంప్రసాద్ రాంబాబు , జగన్ పాల్గొన్నారు.



బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ పులమోతి


ఉప్పొంగిన గెడ్డలతో రాకపోకలకు ఇక్కట్లు



గెడ్డ దాటుతున్న ఓనుకొండ గిరిజనులు

ప్రజాశక్తి - అనంతగిరి : మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డలు, కొండవాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి దీంతో మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు . సరైన రోడ్డు మార్గం, ఉన్న రోడ్లకు వంతెనలు లేకపోవడంతో పొంగి ప్రవహిస్తున్న గెడ్డల్లో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని దిగి దాటి వెళుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇంటినుంచి బయటకు వెళ్లిన తర్వాత మళ్లీ ఇంటికి సురక్షితం చేరుకోవడం గగనమైపోయిందా అన్న పరిస్థితుల్లో బిక్కుబిక్కు మంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

లుంగపర్తి పంచాయతీ ఓనుకొండ, మూలగుమ్మి, నెలపలేం, గుమ్మ పంచాయతీ పరిది కడరేవు,. కొటంగుడ, గొప్పపాలెం, రొంపల్లి పంచాయతీ పరిధి పసిని ,మర్రిపాలెం విజయనగరం జిల్లా అడ్డతీగల పంచాయతీ పరిధి 16 గ్రామాల ప్రజలు చిలకలగడ్డ పంచాయతీ జీలుగులపాడు అనుకొనిఉన్న తాటిపూడి రిజర్వాయర్ కాజ్‌వే మీదుగా ప్రయాణిస్తుంటారు వంతెన పనులు సగంలో నిలిచిపోవడంతో కాజ్‌వే వీరి రాకపోకలకు ఆధార అలాగే పెద్దకోట ,పినకోట, జీనపాడు, పంచాయతీ పరిధిలలో పలు గ్రామాలు ప్రజలకు ఇదే పరిస్థితి ఇటువంటి పరిస్థితుల్లో గ్రామాల నుంచి బయటకు వెళ్లి రావాలంటే ఈ గెడ్డలను దాటడమొక్కటే మార్గం. ఇటునుంచి వెళ్లిన తర్వాత తిరిగొచ్చేసరికి గెడ్డలో నీరు అలాగే ఉంటుందన్న నమ్మకం ఉండదు. ఒక్కోసారి గెడ్డ దాటుతుండగానే నీరు ఉప్పొంగే పరిస్థితులూ ఉన్నాయి. ఇలా నిత్యం రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని మన్యవాసులు ఆవేదన చెందుతున్నారు. ఇక వర్షాకాలంలో అనారోగ్యానికి గురైనా, గర్భిణులు ప్రసవానికి ఆసుపత్రులకు వెళ్లాలన్నా, నిత్యవసరాలు తెచ్చుకోవాలన్నా, గిరిజన ఉత్పత్తులను అమ్మకానికి తీసుకెళ్లాలన్నా గెడ్డను దాటడమొక్కటే మార్గమైన పరిస్థితుల్లో ఆందోళన చెందుతున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శివాజీ, తదితరులు

28న విద్యా ప్రోత్సాహకాల ప్రదానోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో పోర్టు కళావాణి విశ్వనాధ కన్వెన్షన్ ఆడిటోరియంలో ఈ నెల 28న ఉత్తమ విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవ అభినందన సభ నిర్వహించనున్నట్లు కేంద్ర గౌరీ (గవర) సంఘం అధ్యక్షులు బుద్ధ శివాజీ తెలిపారు. గురువారం కేంద్ర గౌరీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఆడారి శ్యాంప్రసాద్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎమ్మెల్యే పిజివిఆర్.నాయుడు (గణబాబు), ప్రముఖ వైద్యులు మళ్ల భాస్కర్ హాజరవుతారని తెలిపారు. ప్రతి ఏటా మాదిరి విద్యా ప్రోత్సాహంలో భాగంగా ఈ ఏడాది కూడా ప్రతిభగల విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం చేయడం జరుతుందన్నారు. ఈ ఏడాది సుమారు 550 మంది దరఖాస్తు చేసుకున్నారని, 80 శాతానికిపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు మెమెంటో, నగదు ఇచ్చి సత్కరించనున్నామని తెలిపారు. అదేవిధంగా నిరుపేద గవర సామాజిక తరగతి పిల్లలను తమ సంఘం ఆధ్వర్యంలో చదివిస్తామని చెప్పారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చ అప్పారావు మాట్లాడుతూ పదో తరగతి నుండి పీజీ వరకు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ కన్సలేషన్ బహుమతులు ఇస్తామన్నారు. మీడియా సమావేశంలో సంఘం శాశ్వత వారసత్వ ఉపాధ్యక్షులు మొల్లేటి వీర కుమారస్వామి, ఉపాధ్యక్షులు పెంటకోట సంజీవరావు నాయుడు, సహాయ కార్యదర్శి శరగడం సత్యనారాయణ, వేగి సత్యనారాయణ, మళ్ల బలరాం, రవి, మళ్ల రవికుమార్ పాల్గొన్నారు.

23 నుండి ఆధార్ నమోదు

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలం సీలేరులో ఈనెల 23 నుంచి ఐదు రోజుల పాటు ఆధార్ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ విజయ్ లక్ష్మి వెల్లడించారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 11 నుంచి సీలేరు మేజర్ పంచాయతీ పరిధి సీలేరు, చింతపల్లి క్యాంప్, చంద్రుపల్లి, లైకాన్ పూర్, టిఅర్‌సి గ్రామాల్లో ఇంటింటికి సచివాలయ సిబ్బంది వెళ్లి ఆధార్ సర్వే నిర్వహించినట్లు చెప్పారు. ఈ నెల 23 నుంచి ఐదు రోజుల పాటు సీలేరులో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసి ఆధార్ అప్డేట్, నూతనంగా ఆధార్ కార్డుల నమోదు చేస్తామని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

3న పల్లాకు సన్మానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గాజువాక అసెంబ్లీ నియోజవర్గం నుంచి అత్యధిక మెజారిటీతో గెలుపొందడమే కాకుండా టిడిపి రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావును ఆగస్టు 3న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో తమ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించనున్నట్లు మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ గురువారం మీడియాకు తెలిపారు. విశాఖ నగర అభివృద్ధిలో మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులకు సన్మాన సందర్భంగా పల్లా దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు.

విశాఖలో లక్ష ఉద్యోగాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో లక్ష ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ తెలిపారు. సిఐఐ విశాఖపట్నం ఆధ్వర్యంలో సిఐఐ విశాఖపట్నం కౌన్సిల్ సమావేశం గురువారం నగరంలోని ఫోర్ పాయింట్స్ హోటల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీభరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారని తెలిపారు. సిఐఐ విశాఖపట్నం జోన్ అధ్యక్షులు గ్రంధి రాజేష్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో వి.మౌళితో పాటు నగర పరిధిలోని 50 సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా గుడిస రహదారి

జారు బురదలో పర్యాటకుల ఇబ్బందులు



అధ్వానంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

వారం రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పుల్లంగి పంచాయితీ పరిధిలో ఉన్న గుడిస పర్యాటక ప్రాంతానికి వెళ్లే రహదారి అస్తవ్యస్తంగా తయారైంది. గుడిస ప్రాంతం పర్యాటకంగా ప్రతి ఒక్కరినీ ఆకర్షించే ప్రదేశం. అయితే ఈ ప్రాంతానికి వెళ్లే రహదారి మట్టి దారి కావడంతో వారం రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు ఈ రహదారి అస్తవ్యస్తంగా మారింది. వాహనాలు వెళ్లడానికి వీల్లేకుండా ఉంది. జారు బురదగా ఉండడంతో గుడిస ప్రాంతాన్ని చూడటానికి వస్తున్న పర్యాటకులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని బొలెరో వాహనదారులు ప్రయాణానికి ఇబ్బందిగా ఉన్నా దానిని లెక్కచేయకుండా గుడిస పర్యాటక ప్రాంతానికి వాహనాలు నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో చాలా వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి.

ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుడిస కొండ ప్రాంతం ప్రాచుర్యం పెరగడంతో ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా చుట్టుపక్కల ప్రాంతాల నుండి పర్యాటకులు తాకిడి ఎక్కువైంది. వర్షాలు సైతం లెక్కచేయకుండా పర్యాటకులు ఈ ప్రాంతాన్ని చూడటానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గుడిస పర్యటక ప్రాంతానికి శాశ్వతంగా రహదారి నిర్మాణం చేయాలని, అంత వరకు వర్షాకాలంలో గుడిస పర్యాటకం కొంతకాలం మూసి వేయాలని, లైసెన్స్ కలిగిన డ్రైవర్లతో ఫిట్నెస్ కలిగిన వాహనాలను సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షణలో మాత్రం ఈ పర్యాటక ప్రాంతానికి నడపాలని పలువురు కోరుతున్నారు.

షిప్‌యార్డ్ సమస్యలపై తపన్‌సేన్‌కు వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : షిప్‌యార్డ్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్‌కు షిప్‌యార్డ్ సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రసాద్, అధ్యక్షులు బిఎస్ఎన్.రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ విక్టరీ ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. రూ.20 వేల కోట్లు విలువగల 5 ఎఫ్ఎస్ఎస్ వర్క్ ఆర్డర్స్‌లో 2 ఎఫ్ఎస్ఎస్ షిప్పులను ఎల్ అండ్ టికి ఇవ్వడం సంస్థకి ఆర్థికంగా నష్టం చేకూర్చే చర్య అని పేర్కొన్నారు. పలు కార్మిక సమస్యలనూ వివరించారు. వాటన్నింటినీ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకెళ్తానని తపన్‌సేన్ తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర నాయకులు ఎం.జగ్గునాయుడు, ఆల్ ఇండియా స్టీల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కో - కన్వీనర్ కె.కుమార్ మంగళం పాల్గొన్నారు.

ఎర్రమట్టి దిబ్బలను పరిశీలించిన సిపిఎం నేతలు



ఎర్రమట్టి దిబ్బల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గంగారావు, మూర్తి

ప్రజాశక్తి - భీమునిపట్నం : ఎర్రమట్టి దిబ్బల ప్రాంతాన్ని సిపిఎం జివిఎంసి ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి గురువారం పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎర్రమట్టి దిబ్బలను దేశ సంపదగా అభివర్ణించారు. వాటిని కాపాడడం ప్రభుత్వాల బాధ్యతని తెలిపారు. భీమునిపట్నం మూచివల్లీ ఎయిడెడ్ కో - ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి 1979లో 379 ఎకరాలు కేటాయించినట్లుగా భీమిలి ఆర్‌డిఒ చెబుతుండగా 2014లో మరో జిఒ ఇస్తూ భూ కేటాయింపులు జరిపారని తెలిపారు. 2016లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అక్కడ మొత్తం భూమి 91 ఎకరాలను జియో హెరిటేజ్ భూములుగా గుర్తించి విభజించిందని ఆర్‌డిఒ అంటున్నారని తెలిపారు. ఆ విభజన ఎలా జరిగిందని, విభజనకు ప్రాతిపదిక ఏమిటని గంగారావు ప్రశ్నించారు. ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలో ఉన్న భూములు జియో హెరిటేజ్ భూములుగా తమ పార్టీ క్షేత్ర స్థాయి పరిశీలనలో ప్రాథమికంగా గుర్తించామని అన్నారు. పలు చోట్ల సహజ సిద్ధమైన ఎర్రమట్టి దిబ్బలను ధ్వంసం చేసిన ఆనవాళ్లు కనిపించాయన్నారు. భౌతికంగా సర్వే జరపలేదని ఇట్టే స్పష్టమౌతోందని చెప్పారు. క్షేత్ర స్థాయి పరిశీలన జరపకుండానే జివిఎంసి లే అవుట్‌లకు ఎలా అనుమతులు ఇచ్చిందని, విఎంఆర్‌డిఎ, సిఆర్‌జెడ్ అనుమతులు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. అవన్నీ పలు అనుమానాలకు దారితీస్తున్నాయని అన్నారు. 2014-19, 2019-24 మధ్య సంబంధిత భూముల కేటాయింపు ప్రత్యుత్తరాలపై వాస్తవాలు తెలపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

అపహరించిన బైక్ స్వాధీనం

ప్రజాశక్తి-సీలేరు : జికె వీధి మండలం దారకొండ పంచాయతీ డబ్బుకోట గ్రామానికి చెందిన శోబా విశ్వనాథ్ బైకును బుధవారం సాయంత్రం అపహరణకు గురి కాగా, గురువారం దానిని దొంగల నుండి స్వాధీనం చేసుకున్నారు. బాధితుడు అన్నయ్య సోబా జగన్ తెలిపిన వివరాల ప్రకారం... శోబా విశ్వనాథ్ ప్రతిరోజూ లాగే బుధవారం సాయంత్రం 5 గంటలకు తన ఇంటి ముందు హోండా షైన్ బైక్ పార్కు చేశాడు. అనంతరం విశ్వనాథ్ తమ దుకాణంలో వ్యాపారం చేసుకుంటున్న సమయంలో గుట్టు చప్పుడు కాకుండా దొంగలు బైకును అపకరించుకుపోయారు. బైక్ ఆచూకీ కోసం గురువారం ఉదయం నుంచి తమ స్నేహితులతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఆంధ్రా -ఒడిశా సరిహద్దు పెట్రాయి గ్రామ సమీపంలో కొందరు యువకులు సంబంధిత బైక్‌తో సంచరిస్తున్నట్లు గుర్తించారు. వారిని వెంబడించి పట్టుకోడానికి ప్రయత్నించగా అపహరించిన బైక్ విడిచిపెట్టి దొంగలు అక్కడి నుంచి పారిపోయారు. తమ బైక్‌ని స్వాధీనం చేసుకొని ఇంటికి చేరుకున్నారు. దొంగతనాలపై పోలీసులు దృష్టి సారించాలని వారు కోరారు.

పురోహిత దంపతులకు సత్కారం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ఆంజనేయస్వామి ఆలయంలో పురోహితులుగా 20 సంవత్సరాల పాటు సేవలందించిన ప్రసాద్ దంపతులను, ఆయన మాతృమూర్తిని సీలేరు రామాలయ ఆలయ కమిటీ శిరిడిసాయి సంఘం సభ్యులు గురువారం ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ప్రసాద్ అనారోగ్య రీత్యా విశాఖపట్నం వారి కుటుంబ సభ్యుల వద్దకు వెళ్తున్న నేపథ్యంలో దేవాలయాలకు ఆయన అందించిన సేవలను గుర్తించి ఈ సత్కారం చేశారు. ఈ సందర్భంగ ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి మాట్లాడుతూ పురోహితులు ప్రసాద్ ఊరి విడిచి వెళ్లడం కొంత బాధ కలిగిస్తుందని, అయినప్పటికీ అతను ఆరోగ్యరీత్యా వెళ్లక తప్పడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో షిరిడీ సాయి సంఘ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-కూనవరం : విశాఖపట్నంలో విలేకరులపై అనుచత వ్యాఖ్యలు చేసిన వైసిపి ఎంపీ విజయసాయిరెడ్డి వారికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీమంతుల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అరేయ్, నీ పేరేమిటి, నువ్వు ఎవర్రా అంటూ విలేకర్లను అసభ్య పదజాలంతో పిలవడం దారుణమన్నారు. ఎంతో రాజకీయ అనుభవం, ఉన్నత పదవులు నిర్వహించిన వారు విలేకర్ల పట్ల చాలా మర్యాదగా మాట్లాడుతారని తెలిపారు. కాని ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని ప్రజలు ఇచ్చినా విజయసాయిరెడ్డి తన పద్ధతులు, రౌడీయిజం మారలేదని పేర్కొన్నారు. ఇకనైనా పద్ధతి మార్చుకొని ప్రజలతోనూ, విలేకరులతోనూ ఎలా నడుచుకోవాలో తెలుసుకోవాలని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొత్తుల నరసింహారావు, ఎస్‌కె అహ్మద్ బాషా, శ్రీమంతుల సతీష్, బండారు నరసింహారావు, నందికొండ శీను, సర్పంచ్ సొందే రామయ్య, పి శివ, ఎం రాము, ఇస్మాయిల్, యస్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

21న కోయ భాషా దినోత్సవం

ప్రజాశక్తి-విఆర్.పురం : ఈ నెల 21న విశ్వ కోయ, గోండి భాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు తెలిపారు. మండలంలోని రేఖపల్లి వద్ద వేటకాని మల్లయ్య ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీల అస్తిత్వం, సంస్కృతీ సంప్రదాయాలు, ఉనికి, భవిష్యత్ భాషా మీదనే ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు. భాషా అనేది లేకపోతే ఆదివాసీ చట్టాలు, హక్కులు మొత్తం కోల్పోయే పరిస్థితి వస్తుందన్నారు. ప్రతి ఒక్కరు మన భాషా మాట్లాడాలని, పిల్లలకు కూడా ఆ భాషా నేర్పించాలని పిలుపు ఇచ్చారు. ఈ నెల 21న ప్రతి ఆదివాసీ గ్రామంలోనూ కోయ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆదివాసీ నాయకులు పాయం లక్ష్మణ్‌రావు, వి.రాజేశ్వరి, సిహెచ్.రాములమ్మ, సంకూరమ్మ, శాంత కుమారి, ఉమామహేశ్వరి, సంజీత, సంధ్యారాణి, అంజలి దేవి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ రికవరీ మేళాలో రూ.4.65 కోట్లు అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సైబర్ క్రైమ్‌లో బాధితులు పోగొట్టుకున్న సొమ్ము రికవరీ మేళాను గురువారం మధ్యాహ్నం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. రికవరీ చేసిన రూ.4.65 కోట్లును 150 మంది బాధితులకు అందజేశారు.